

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద



మహదేవపూర్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వరద ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం బ్యారేజీలోకి 1.23 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా గేట్లన్నీ ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 2.40 మీటర్లుగా ఉందని అధికారులు పేర్కొన్నారు.

హత్య కేసులో పదేళ్ల జైలు



కృష్ణకాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో ఐదేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో ఓ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష పడింది. భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వివరాలను మంగళవారం వెల్లడించారు. 2020 మార్చి 2న కమలాపూర్‌లో రేగళ్ల తిరుపతికి ఇదే గ్రామానికి చెందిన మాచర్ల రవికి గొడవ జరిగింది. ఈ క్రమంలో తిరుపతిపై రవి కత్తితో దాడి చేశాడు. దీంతో తిరుపతి మృతి చెందాడు. ఈ ఘటనపై భూపాలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జ్‌షీట్ చేయగా రవికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వచ్చింది. ఈ కేసును సమర్థంగా నడిపించినందుకు పోలీసులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను, ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

సర్కారు కానుక ఏదీ..?!

- ఆదర్శ వివాహాలకు అందని ప్రోత్సాహకం
- కులాంతర పెళ్లిళ్లు చేసుకున్న వారికి నిరాశ
- నిధులు రాక తప్పని నిరీక్షణ
- జిల్లాలో ఎదురుచూస్తున్న జంటలు





మొగుళ్లపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ వివాహాలకు ఆదరణ కరువు అవుతోంది. కులాంతర పెళ్లిళ్ల చేసుకుంటే ప్రోత్సాహకాలు అందిస్తామన్న కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ నిధులు విడుదల కావడం లేదు. షెడ్యూల్ కులానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయి ఇతర కులాలకు చెందిన వారిని పెళ్లి చేసుకుంటే ఆర్థిక సాయాన్ని అందిస్తారు. ఇది వరకు రూ.50 వేలు ఉన్న ఆర్థికసాయాన్ని గత ప్రభుత్వం 2019 నవంబరులో రూ.2లక్షల50వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఆదర్శ దంపతులకు సంబంధించిన ప్రోత్సాహకాలకు నిధులు విడుదల చేయడం లేదు. వివాహం చేసుకున్న జంటలకు ఆర్థికసాయం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు.

135పైగా దంపతుల దరఖాస్తులు

భూపాలపల్లి జిల్లాలో ఆదర్శ వివాహాలు చేసుకున్న 135 జంటలు ప్రోత్సాహకం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. వీరిలో 42 జంటలకే సాయం అందింది. ఇంకా 93 జంటల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వారికి ఆర్థికసాయం అందాల్సి ఉంది. గతంలో ఉన్న ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం పెంచినప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ఆదర్శ వివాహాలు చేసుకున్న దంపతులకు నిరాశే ఎదురవుతోంది. కుల ప్రాతిపదికన సమాజంలో అసమానతలను తొలగించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకానికి నిధుల కొరత ఇబ్బందులు కలిగిస్తోంది.

అర్హులు వీరే....

ఆదర్శ కులాంతర వివాహం చేసుకున్నవారు ఆర్థికసాయం పొందాలంటే పలు అర్హతలు కలిగి ఉండాలి. దంపతుల్లో ఒకరు తప్పకుండా షెడ్యూల్ కులానికి చెందినవారై ఉండాలి, మరొకరు ఇతర కులానికి చెందినవారై ఉండాలి. అమ్మాయికి 18 ఏళ్ల కచ్చితంగా నిండి ఉండాలి. వివాహ చట్టం ప్రకారం రిజిష్టర్ అయి ఉండాలి. పెళ్లయినజంట వార్షిక ఆదాయం రూ.5లక్షల కంటే తక్కువగా ఉండాలి. మొదటి వివాహానికి మాత్రమే ఈ ప్రోత్సాహకం అందుతుంది. వివాహమైన ఏడాదిలోపు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఆర్థికసాయం అందుతుంది.

అవసరమైన ధ్రువీకరణ పత్రాలు

వేర్వేరు కులానికి చెందిన యువతీ యువకులు పెళ్లికి సంబంధించిన ఆధారాలతో షెడ్యూల్ కులాల అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత శాఖ అధికారులు విచారణ చేసి అర్హులని తేలితే ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. వివాహం చేసుకున్న దంపతులు మూడు ఫొటోలు, కులం, వయసు ధ్రువీకరణ పత్రాలు విద్యా సంస్థల నుంచి తీసుకున్న టీసీ, మార్కుల జాబితా, వివాహం చేయించిన అధికారి ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారుల నుంచి పొందిన ఫస్ట్ మ్యారేజ్ సర్టిఫికెట్, దంపతులు కలిసి తీసినబ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలి. వివాహానికి సాక్షుల వివరాలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు దరఖాస్తుతో జత చేయాల్సి ఉంటుంది.

దరఖాస్తులు ఎక్కువ.. నిధులు తక్కువ

జిల్లాలో 135 దరఖాస్తులు రాగా 42 జంటలకు మాత్రమే ఆర్థికసాయం అందించారు. ఇంకా 93జంటలకు ఆర్థికసాయం అందించాల్సి ఉంది. ప్రభుత్వం కల్యాణలక్ష్మీ ద్వారా రూ.లక్షా16 వేలను అందిస్తుండడంతో కులాలు వేరైనా పెద్దలు ఒప్పుకుని పెళ్లి చేసుకున్న జంటలకు కల్యాణలక్ష్మీ వైపు మొగ్గుచూపుతున్నారు. గతంలో ఒకే సామాజిక వర్గానికి చెందినవారు పెళ్లిళ్ల చేసుకున్న రోజుల నుంచి క్రమంగా కులాలు, మతాలు వేరైనా కలిస్తేచాలు పెళ్లిళ్ల చేసుకునేవారు.

నిధులు రాగానే సహాయం అందిస్తాం :



ఆదర్శ వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం ఆర్థికసాయాన్ని 2019 నవంబరు నుంచి రూ.2లక్షల 50 వేలకు పెంచింది. జిల్లాలో దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. బడ్జెట్ మేరకు ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని తల్లిదండ్రుల మద్దతు లేని జంటల జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నాం.

\- ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, అధికారులు

ములుగు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టం నిబంధనల ప్రకారం భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా లోకేష్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి భూభారతి చట్టం నిబంధనల ప్రకారం వేగంగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫైల్ ప్రాసెస్ మొత్తం ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే నిర్వహించాలన్నారు. త్వరలో దరఖాస్తు పెండింగ్ ఎక్కడ ఉన్నది చెక్ చేసుకునే అవకాశం ప్రజలకు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వాటిని మినహాయించి మిగిలిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేశ్, తహసీల్దార్ విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు బీమా చేయించాలి

ఈజీఎస్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మంజులాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ మంజులాదేవి

కాటారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన చేయించాలని ఈజీఎస్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మంజులా దేవి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మంది రంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమయ్యారు. కూలీలకు రూ.20 ప్రీమియంతో పీఎంఎస్‌బీవై నమోదు చేయించాలన్నారు. వన మహోత్సవాన్ని పం డుగలా జరిపేందుకు సర్వ సన్నద్ధంగా ఉండాలని, రెండు మూడు రోజుల్లో గుంతలు తవ్వే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. సామాజిక తనిఖీల్లో భాగంగా రెండేళ్లుగా ఇచ్చిన నోటీసులకు పూర్తి స్థాయిలో వివ రణలు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకన్న, ఇన్‌చార్జి ఈసీ శ్రీనివాస్, టీఏలు రవి, మనోజ్, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహరావు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

ఏటూరునాగారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రానున్న మేడారం జాతరకు భక్తుల సౌకర్యార్థం దొడ్ల-కొండాయి బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహరావు (లక్ష్మణ్‌బాబు) డిమాండ్ చేశారు. కొండాయి మార్గం రహదారిని పునరుద్ధరించాలన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని దొడ్లతో పాటు ఎలిశెట్టిపల్లి వాగుపై బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి సీతక్కను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రైతును రాజుగా చూశారని, ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ యూరియా, విత్తనాల పంపిణీలో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించకుండా కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. రైతులు తిరిగి కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. గత వేసవిలో కురిసిన వడగళ్ల వానకు జిల్లాలో 7 వేల నుంచి 8 వేల ఎకరాల పంట నష్టం జరిగిందని, దీంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ చేసిన పోరాటాలకు దిగి వచ్చిన ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం చెల్లిస్తానని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ బాబు, తుమ్మ మల్లారెడ్డి, ఎమ్డీ. షఫీ, తోట కృష్ణయ్య, గడదాసు సునీల్, పూమా నాయక్, బూక్య జంపన్న, పి.మధుసుదన్‌రెడ్డి, తాడూరి రఘు, తూరం పద్మ, ఎమ్డీ. ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నాహాలు

- ఉమ్మడి జిల్లాలో మారిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు సంఖ్య
- తగ్గిన 14 ఎంపీటీసీ స్థానాలు
- పెరిగిన 4 జడ్పీసీటీ స్థానాలు
- సిద్ధమవుతున్న బ్యాలెట్ బాక్సులు
- ఓటర్ల సంఖ్యలోనూ మార్పు
- స్థానాల వారీగా మ్యాపులు



హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అయితే అంతకుముందు ముందు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరపాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తుండడంతో ఆ మేరకు జిల్లా యంత్రాంగాలు కూడా ఏర్పాట్లు చేస్తున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు, వాటి పరిధిలోని ఓటర్ల వివరాలను ఉన్నికల సంఘం సేకరించింది. ఉమ్మడి జిల్లాలో ఈ మధ్య కాలంలో కొత్త మండలాలు, కొత్త మునిసిపాలిటీలు ఏర్పాటయ్యాయి. కొత్త మునిసిపాలిటీల్లో కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. దీనితో ఉమ్మడి జిల్లాలో అదనంగా నాలుగు జడ్పీటీసీ స్థానాలు పెరిగాయి. 14 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలో మొదట్లో 71 జడ్పీటీసీ స్థానాలు ఉండగా కొత్తగా 4 పెరిగి 75కు చేరుకున్నాయి. ఎంపీటీసీ స్థానాలు 14 తగ్గాయి. మొత్తం 792 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి సంఖ్య 778కి చేరుకున్నది. ఈ మార్పులు చేర్పులకు సంబంధించిన గెజెట్ నోటిఫికేషన్ కూడా జారీ అయింది. మారిన స్థానాలను బట్టే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల మార్పులు చేర్పుల వల్ల ఓటర్ల సంఖ్యలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. తాజాగా తేలిన ఓటర్ల సంఖ్యను బట్టి అధికారులు బ్యాలెట్ బాక్సులను, పోలింగ్ సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే నాటికి అన్ని ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉండేలా జిల్లా యంత్రాంగాలు కసరత్తు చేస్తున్నాయి

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా పరిధిలో జడ్పీటీసీ,

(మిగతా 8వ పేజీలో)

ములుగు జిల్లాలో..

ములుగు జిల్లాలో సైతం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు జరిగాయి. ఈ జిల్లాలో ఇంతకు ముందు 9 జడ్పీటీసీలు ఉండగా జడ్ మల్లంపల్లి మండలం కొత్తగా ఏర్పాటయింది. దీనితో వీటి సంఖ్య 10కి పెరిగింది. ఎంపీటీసీ స్థానాలు 87 నుంచి 83కు తగ్గాయి. కొత్తగా ములుగు మున్సిపాలిటీ కావడంతో బండా రుపల్లి, జీవంతరావుపేట, మరో గ్రామం ఇందులో విలీనం అయ్యాయి. దీనితో ఎంపీటీసీల సంఖ్య 83కు తగ్గాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా స్థానిక సంస్థల సంఖ్యలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ జిల్లాలో ఇంతకు ముందు 11 మండలాలు ఉండగా గోరికొత్తపల్లి మండలంగా ఏర్పడడంతో జడ్పీటీసీల సంఖ్య 12కు చేరుకున్నది, ఎంపీటీసీ స్థానాలు 106 నుంచి 109కి పెరిగాయి.

ఇంకెన్ని రోజులు ఎదురుసూడాలె..?

- ఇంకా తెరుచుకోని కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాల
- బడికి వచ్చి తిరిగి వెళ్తున్న ఆదివాసీ విద్యార్థులు

వివరాలు 8వ పేజీలో..

అధ్యాపకులకు యోగాపై అవగాహన



అధ్యాపకులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ మాధవి

భూపాలపల్లిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులకు యోగాపై అవగాహన కల్పించారు. శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ యోగా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ చెరుకుపల్లి రవీందర్ ప్రారంభించగా భూపాలపల్లి సెంటర్ కోఆర్డినేటర్ చెరుకుపల్లి మాధవి హాజరై తరగతులు నిర్వహించారు. ఆధునిక ప్రపంచంలో అనేక ఒత్తిడులకు ప్రతి ఒక్కరు గురవుతున్నారని అన్నారు. అలాగే విస్తృతమైన ఆలోచనల మూలంగానే మనిషికి రకరకాల రోగాలు వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో వాటిని తట్టుకునేందుకు ధ్యానం ఎంతో ఉపయోగపడుతుందని, తద్వారా ఆరోగ్యం కుదుటపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలూనాయక్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కాల్వలు మాకొద్దు

తేల్చి చెప్పిన రైతులు.. పంటలు నష్టపోతామని ఆవేదన



సమావేశంలో పాల్గొన్న రైతులు

మహదేవపూర్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కడుతున్న కాల్వలు తమ గ్రామాలకు వద్దని రైతులు తేల్చి చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండలంలోని మహదేవపూర్, బ్రాహ్మణపల్లి, సూరారం, ఎలికేశ్వరం, బెగులూరు గ్రామాలకు చెందిన సుమారు 200 మంది రైతులు హాజరయ్యారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల నిర్మాణంపై వారి అభిప్రాయాలను తిరుపతిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. దీనిపై రైతులు ఈ కాల్వల వల్ల తాము పంట భూ ములను భారీగా నష్టపోతామని అన్నారు. ఈ కాల్వలు తమ పంట భూముల మీదుగా నిర్మించొద్దని ముక్తకం ఠంతో చెప్పారు. దీనిపై పీఏసీఎస్ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను మంత్రి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

రాష్ట్ర ఉత్తమ పీఏసీఎస్‌గా ములుగు

పురస్కారం అందుకున్న చైర్మన్ సత్తిరెడ్డి



పురస్కారం అందుకుంటున్న సొసైటీ చైర్మన్ సత్తిరెడ్డి

ములుగు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ములుగు పీఏసీఎస్ రాష్ట్ర ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంగా ఎంపికైంది. నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టెస్కా చైర్మన్ మార్నేని రవీందర్‌రావుల చేతులమీదుగా ములుగు సొసైటీ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు. సొసైటీ కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించడంతోపాటు రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులను సకాలంలో అందించడం, గోదాంల నిర్వహణ, తదితర అంశాలలో ఉత్తమ సేవలందించినందుకుగాను ఈ అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని చైర్మన్ సత్తిరెడ్డి తెలిపారు. పీఏసీఎస్ నిర్వహణలో సహకారం అందించిన రాష్ట్రమంత్రి ధనసరి సీతక్క, డీసీవో సర్దార్‌సింగ్, అధికారులు, సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'ఓపెన్'గానే మట్టి దందా

- ● ఓసీ-2 నుంచి బయటకు తరలింపు
- ● సింగరేణికి భారీగా నష్టం
- ● చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న సింగరేణి అధికారులు!

కృష్ణకాలనీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో మట్టి దందా మళ్లీ జోరందుకుంది. అక్రమంగా ఈ వ్యాపారం సాగు తుండటంతో సంస్థకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వందలాది ట్రిప్పులకు అనుమతిలిస్తూ అధికారులు, దళారులు సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రధానంగా సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్‌కాస్టు (ఓసీ)-2 నుంచి మట్టి అక్రమ వ్యాపారం మూడు పువ్వుల, ఆరు కాయలుగా కొనసాగుతోందని తెలుస్తోంది.

ఓసీ-2 నుంచి బయటకు..

సింగరేణి ఏరియాలోని ఓసీ-2 ప్రాజెక్టు నుంచి మట్టి దందా సాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వేళాపాలా లేకుండా లారీల్లో మట్టి అక్రమంగా బయటకు వెళ్తోంది. ఈ వ్యాపారం చేసే వ్యక్తులు ఓసీ భూనిర్వాసితులను ముందు పెట్టి సాగిస్తున్నట్లు సమాచారం. మరో వైపు అభివృద్ధి పనుల కోసం అనుమతులు తీసుకోవడం, అడిగిందే తడవుగా అధికారులు ఇచ్చేయడం లాంటివి వెనువెంటనే జరిగిపోతోందని తెలుస్తోంది. ఓసీ నుంచి తీసుకున్న మట్టిని వ్యాపారంగా మలుచుకొని బయట విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు, భూముల ప్లాటింగ్, వెంచర్లకు, రోడ్ల నిర్మాణాలకు మట్టిని వాడుతున్నట్లు తెలిసింది. ఒక్కో లారీకి రూ.3 వేల నుంచి రూ.3,500 చొప్పున విక్రయాలు జరుపుతున్నట్లు తెలిసింది.

భవిష్యత్ పరిస్థితేమిటి?

ఓసీలోని మట్టిని అక్రమంగా బయటకు తరలిస్తుంటే బ్యాక్ ఫిల్లింగ్ పరిస్థితేమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఓసీల నుంచి బొగ్గు తీయాలంటే ముందుగా ఉన్న మట్టిని తొలగించాల్సి ఉంటుంది. అలా తొలగించిన మట్టిని స్టోర్ చేసుకొని బొగ్గు నిల్వలు తీయడం పూర్తయ్యాక ఏర్పడిన గుంతల్లో ఆ మట్టిని నింపాలనే నిబంధన ఉంది. అలా నింపడాన్ని బ్యాక్ ఫిల్లింగ్ అంటారు. ఈ నేపథ్యంలో తీసిన మట్టిని తీసినట్టుగా బయటకు పంపిస్తే భవిష్యత్తులో మళ్లీ బ్యాక్ ఫిల్లింగ్ (గుంతలు పూడ్చడం) సమయానికి ఎలా సర్దుబాటు చేస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇంత బహిరంగంగా మట్టి బయటకు తరలుతున్నా సింగరేణి అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.



లారీలో తరలుతున్న మట్టి

ఎవరికీ అనుమతులు ఇవ్వడం లేదు

ఓసీ-2 నుంచి మట్టి బయటకు పోతుందనడం అవాస్తవం. మట్టి తీసుకెళ్లేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వడం లేదు. ప్రభుత్వ అవసరాలకు తప్పనిసరి అయితే ఇతర మార్గాల ద్వారా సమకూరుస్తున్నాం. అలాగే, బ్యాక్ ఫిల్లింగ్‌కి ఇంకా చాలా టైం పడుతుంది. అప్పటి వరకు మట్టి వస్తుంది. అలాంటి సమస్యేమీ ఉండబోదు.

- కవీంద్ర, ఎస్‌వోటూ జీఎం, భూపాలపల్లి ఏరియా



స్వాధీనం చేసుకున్న టేకు కలప

టేకు కలప పట్టివేత

వాజేడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): విలువైన టేకు కలపను తరలిస్తుండగా ఫారెస్టు అధికారులు పట్టుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా వరి పొట్టు బస్తాలను కలప దుంగలపై వేసి తరలించేందుకు స్మగ్లర్లు సిద్ధం కాగా చాకచక్యంగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం దూలాపురం రేంజర్ బాలకృష్ణ ఈ వివరాలను వెల్లడించారు. మండలంలోని గణపురంలో మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.45 గంటల ప్రాంతంలో వెంకటాపురం వైపు నుంచి వస్తున్న గూడ్స్ ట్రాలీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 8 పెద్ద టేకుదుంగలు ఉన్నట్టు ఎఫ్‌బీవోలు వాసుబాబు, పవన్ గుర్తించారు. వాహనంలో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి ఉండగా వివరాలు సేకరిస్తుండగా ఇద్దరు వ్యక్తులు సిబ్బంది కళ్లుగప్పి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న కలప వాహనాన్ని వెంకటాపురం డివిజన్ కార్యాలయానికి తరలించి పంచనామా నిర్వహించారు. వెంకటాపురం మండలంలోని ఆలుబాక వైపు నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి వాహనం వెళ్తున్నట్టు రేంజర్ తెలిపారు. పట్టుబడిన టేకు కలప విలువ రూ 3.10 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గంగారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ముఖ హాజరు నమోదులో జాప్యం చేసిన ఇద్దరు పాఠశాల ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గంగారం మండలంలో 41 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 19 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రతీ పాఠశాలలో హాజరైన విద్యార్థి ఫొటో తీసి డీఎస్సీ ఎఫ్ఆర్సీ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి పంపిచాల్సి ఉంటుంది. అయితే సోమవారం మండలంలోని బావురుగొండ, తాళ్లగుంప పాఠశాలల విద్యార్థుల ముఖ హాజరు పంపకపోవటంతో ఉపాధ్యాయుల నిర్లక్ష్యపు పనితీరుపై సమాధానం చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ విషయంపై ఎంఈవో రమాదేవిని వివరణ కోరగా బావురుగొండ టీచర్ లీవ్‌లో ఉండటం వలన మరోటీచర్ కి ట్యాబ్ ఇవ్వకపోవటంతో జాప్యం జరిగిందన్నారు. తాళ్లగుంపులో సిగ్నల్స్ లేకపోవటం వలన జాప్యం జరిగిందంటూ వివరణ ఇచ్చారని తెలిపారు.

భూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్

కాటారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి కొందరు అక్రమార్కులు దరఖాస్తులు చేసుకున్నారని తెలంగాణ ప్రజా ఫ్రంట్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ ఆరోపించారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కాటారం మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాటారం డివిజన్ పరిధిలో పలు ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్, ఇనాం, శిఖం భూములు కబ్జాలకు గురయ్యాయని తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్, చెరువు శిఖం భూములు ఆక్రమించి సాగుచేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొందరు కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లతో భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకున్నారని, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

రెడ్డి బాలికల హాస్టల్‌లో ప్రవేశాలు

హనుమకొండ కలెక్టరేట్, జూలై15(ఆంధ్రజ్యోతి): రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలబాలికల హాస్టల్‌లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాదిరెడ్డి రవీందర్‌రెడ్డి, చాడ సునిల్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఆపై చదువుకునే బాలబాలికలు ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు బాలికతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరైనా ఒకరు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. దరఖాస్తులకు హనుమకొండలోని కనకదుర్గకాలనీ హాస్టల్‌లో లేదా 96766 49811లో సంప్రదించాలని, ఒక వేళ స్వయంగా అందించలేని పక్షంలో ఫోన్‌కు వాట్సాప్ ద్వారా కూడా అప్లికేషన్ ఫామ్ నింపి పంపిచొచ్చని, ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

విద్యుత్ డివిజన్ కేంద్రం మంజూరు

కాటారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): కాటారం కేంద్రంగా నూతన విద్యుత్ డివిజన్(ఆపరేషన్స్) మంజూరైంది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే మహదేవపూర్ కేంద్రంగా విద్యుత్ సబ్ డివిజన్ (ఏడీఈ ఆపరేషన్స్)ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పరిధి అధికంగా ఉన్న నేపథ్యంలో కొత్తగా కాటారం డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని భూపాలపల్లి ఎస్ఈ ఇచ్చిన ప్రతిపాదనల మేరకు డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తూ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కాటారం నూతన విద్యుత్ డివిజన్(ఆపరేషన్స్) కేంద్రానికి డీఈ, ఏడీఈ మహదేవపూర్, ఏఈ (టెక్నికల్, కమ్యూనికేషన్స్), సబ్ ఇంజనీర్లు-2, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్లు-2, ఆఫీస్ సబార్డినేట్లు-3 (కాటారం డివిజన్-2, మహదేవపూర్ సబ్ డివిజన్-1), వాచ్‌మన్-1, ఎస్సీజీఎస్‌వో-1 పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని అధికారులు తెలిపారు. కాటారం ఏడీఈ పరిధిలో కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాలు, నూతన మహదేవపూర్ సబ్ డివిజన్‌లో మహదేపూర్, పలిమెల మండలాలు ఉండనున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో విద్యుత్ శాఖ కాటారం డివిజన్‌కేంద్రం ఏర్పాటు కావడంతో విద్యుత్ సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి నోచుకుంటాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాటారం విద్యుత్ శాఖ కార్యాలయం

గిరిజన ఆవాసాలకు సౌకర్యాలు కల్పించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శరత్

ఏటూరునాగారం రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఏజెన్సీ గ్రామాల్లో సమర్థంగా అమలు చేసి గిరిజలను ఆవాసాలకు సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శరత్ అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏలోని పీవో, ఏపీవో, డిప్యూటీ డైరెక్టర్, డీటీడీవో, నోడల్ అధికారులతో ఆయన హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా పీఎం జన్మాన్, జన్‌భాగీదారీ, ఆదికర్మయోగి తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించే ఈపథకాల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని సుమారు 700 మంది గిరిజనులకు లబ్ధి చేకూరుతోందని సూచించారు. ఈపథకాల ద్వారా గిరిజన గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, తాగనీటి సరఫరా, విద్య, వైద్యం, విద్యుత్, గృహనిర్మాణాల వంటి ప్రాథమిక అవసరాలను తీరుస్తున్నట్టు వివరించారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గురుకులాల్లో విద్యనభ్యసించే గిరిజన విద్యార్థుల సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారి ఆరోగ్యస్థితిపై హెల్త్ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలన్నారు. రక్తహీనత, సికిల్‌సెల్, ఇతర వైద్యసేవలు విద్యార్థులకు అందించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, ఇతర సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీని నష్టపరిచే వ్యాఖ్యలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పార్టీని నష్టపరిచే వ్యాఖ్యలు మానుకోవాలని, అలాంటి వారిని పార్టీ నుంచి తొలగిస్తామని టీపీసీసీ నాయకుడు, ఓయూ జేఏసీ అధికార ప్రతినిధి నరేందర్ పవార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ హెచ్చరించారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని కించపరిచేలా ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఝాన్సీరెడ్డి మద్దతుతో మార్కెట్ చైర్మన్‌గా పదవి పొంది ఇప్పుడు ఆమెకు వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాజకీయాల్లోకి రాకముందు నుంచే ఝాన్సీ రెడ్డి కుటుంబం ఉమ్మడి వరం

కాంగ్రెస్ నుంచి పలువురి బహిష్కరణ

గల్ జిల్లాలో ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. పార్టీ పదవులు అప్పగించలేదనే నెపంతో కొందరు నాయకులతో చేరి విమర్శలు చేస్తున్నారని, పార్టీని నష్టపరిచేలా ఝాన్సీ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రెంటల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మెరుగు మల్లేషం, చిట్టిమల్ల మహేష్, బాలునాయక్, ఎద్దు మహేష్, జె. రవీందర్‌రెడ్డి, డి. శ్రీనివాస్, డి. వంశీకృష్ణను పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు సోమరాజశేఖర్, హమ్యానాయక్, డాక్టర్ సోమేశ్వర్‌రావు, ముద్దసాని సురేష్, మహేశ్వరి, ఉష, వెంకటాచారి, మల్లారెడ్డి, మేకల కుమార్, అచ్చిరెడ్డి, దొంగరి శంకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఈనెల 23 నుంచి ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి) : కేయూ ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 23, 25, 28, 30, ఆగస్టు 1, 4, 6వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

25 నుంచి ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు..

కేయూ ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 28, 30 ఆగస్టు 1, 4,వ తేదీల్లో పరీక్షలు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారులు మంగళవారం వెల్లడించారు. పరీక్షలు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని వెల్లడించారు.

ట్రాఫిక్ ఎస్సైగా అరుణ్‌కుమార్

మహబూబాబాద్ క్రైం, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ టౌన్ ట్రాఫిక్ ఎస్సైగా అరుణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ట్రాఫిక్ ఎస్సైగా ఇక్కడ విధులు నిర్వహించిన డి.నాగేశ్వర్‌రావు వీఆర్‌కు ఈటాచ్ చేశారు. ఐటీ కోర్‌లో పనిచేసిన అరుణ్‌కుమార్ ట్రాఫిక్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం టౌన్ సీఐ మహేందర్‌డ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రిన్సిపాల్‌పై దాడి చేసిన ఘటనలో ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ జి. మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత జూన్ 10న ఓపెన్ డిగ్రీ పరీక్షలు జరుగుతున్న సమయంలో ప్రిన్సిపాల్ పర్యవేక్షిస్తున్న క్రమంలో క్రిష్ణ వంశీ, గోపి శ్రీసాయిలు అనే విద్యార్థులు అసత్యపదజాలంతో దూషించి, దాడికి పాల్పడి గాయపర్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఇచ్చిన పిర్యాదు మేరకు ఇద్దరు విద్యార్థులపై కేసు నమోదు చేసి జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

● ప్రహరీ కూల్చిన ఘటనలో..

ప్రహరీ కూల్చివేసిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణంలోని యాదవ్‌నగర్‌లో భూక్య రాంచంద్రుకు చెందిన వ్యవసాయ భూమి చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీని గుగులోతు సురేష్, గడ్డం రోషన్, వబ్బిలిశెట్టి శ్రీనివాస్, వేముల వెంకన్న, ధారావత్ రవి అనే వ్యక్తులు కూల్చివేయడంతో బాధితుడు రాంచంద్రు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

జోరుగా పీఆర్టీయూ సభ్యత్వ నమోదు

కాటారం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో తెలంగాణ స్టేట్ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (టీఎస్ పీఆర్టీయూ) సభ్యత్వ నమోదు జోరుగా సాగుతోంది. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంగోత్ రవీందర్, అనపర్తి తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం దామెరకుంట, విలాసాగర్, గంగారం, దేవరాంపల్లి, ఒడిపిలవంచ, జాదరావుపేట జడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్‌లలో సభ్యత్వ నమోదు చేయించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం టీఎస్ పీఆర్టీయూతోనే సాధ్యమని సంఘం బాధ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నడిపెల్లి సురేష్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలు నమోదు చేస్తున్న సంఘం నేతలు



మొక్కలకు నీరు పోస్తున్న రైతులు

మొక్కలు బతకాలంటే..

వర్షాలు కురవడం లేదు. కొన్ని రోజులుగా వరుణుడు పలకరించకపోవడంతో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని కుంభంపల్లి గ్రామానికి చెందిన రైతులు తాము సాగు చేస్తున్న కూరగాయల మొక్కలకు బిందెలతో నీరందిస్తున్నారు. పంటలు కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల నుంచి బిందెలతో ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీరందిస్తున్నారు. తోటపల్లి మల్లయ్య, కుంభం బాపు అనే రైతులు ఆరు ఎకరాల్లో అలిశంత, బెండ, కాకర, చిక్కుడుకాయలను సాగు చేస్తున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో ఇంటిల్లిపాది బిందెలతో మొక్కలకు నీరందిస్తున్నారు. - మల్హర్ (ఆంధ్రజ్యోతి)

దర్జాగా జనాలగుట్ట కబ్జా

- ● గుట్టుచప్పుడు కాకుండా బండరాళ్ల తొలగింపు
- ● వీరారం గ్రామస్థుల ఆరోపణ ● ఎక్స్‌కవేటర్ సీజ్

మరిపెడ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరారంలో సర్వే నెంబర్ 301లో 29 ఎకరాల జనాల గుట్ట ప్రభుత్వ భూమి. ఈ గుట్టకు లాలుమియా అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా బేస్‌మెంట్ రాళ్లను కొట్టుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గుట్ట సమీపంలోనే ఓ వ్యక్తి ఈ భూమిపై కన్నేశాడు. లాలుమియాతో ఆ వ్యక్తి కలిసి గుట్ట భూమిని కబ్జాకు ప్లాన్ వేసుకున్నారు. అందుకోసం గ్రామపెద్దలు అమ్మాయ్యాలు పుచ్చుకొని వీరికి సహకరిస్తున్నట్లు సమాచారం. సుమారు రెండు ఎకరాల భూమిలో ఎక్స్‌కవేటర్‌తో పెద్ద రాళ్లను తొలగించే పనులు చేపట్టారు. మూడు రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా ఈ తతంగం నడుస్తుంది. అప్పటికే వందలాది రాళ్ల తొలగించారు. మంగళవారం వీరారం గ్రామస్థులు గుట్ట వద్దకు వెళ్లి రాళ్ల తొలగింపును అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చి ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు. కబ్జాకు యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.



జనాల గుట్ట వద్ద మాట్లాడుతున్న వీరారం గ్రామస్థులు



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2470	1521
పల్లికాయ (సూక)	5900	3450
పల్లికాయ (పచ్చిది)	4550	1575
కందులు	5866	3022
పెసళ్లు	8001	3022
పత్తి	7700	5300
పసుపు (కాడి)	11958	9534
పసుపు (గోల)	10521	9700
తేజ మిర్చి	9000	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	11000	6000
వండర్‌హాట్ ఏసీ	14000	11500
యూఎస్341ఏసీ	12000	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల కోసం ప్రతిపాదిత స్థలం కేయూలో గతంలో ఏర్పాటయిన సీఆర్‌పీఎఫ్ క్యాంపు ప్రధాన ద్వారం

ఇంటిగ్రేటెడ్ స్కూల్ స్థలంపై రచ్చ

కేయూలో కేటాయింపుపై భిన్నాభిప్రాయాలు

- విద్యార్థి సంఘాల్లో సానుకూల, వ్యతిరేక స్పందనలు
- పోటాపోటీ ధర్నాలతో వేడెక్కుతున్న క్యాంపస్ వాతావరణం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్ స్థలంలో ప్రభుత్వ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై రచ్చ జరుగుతోంది. స్కూల్‌కు కేయూ భూమి కేటాయింపుపై విద్యార్థి సంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంఘాలు సానుకూలంగా స్పందిస్తుండగా మరికొన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయులో సుమారు 15 ఎకరాలు కేటాయించేందుకు సమ్మతి తెలియచేస్తూ విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశంలో తీర్మానం ఆమోదించిన తర్వాత ఈ చర్చ మొదలైంది. విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగాయి. అనుకూల, వ్యతిరేకతలతో వివాదానికి తెరలేపాయి. పోటాపోటీ ధర్నాలతో కేయూక్యాంపస్ వాతావరణం వేడెక్కుతోంది. ఈ క్రమంలోనే బీఆర్‌ఎస్‌వీ ఈనెల 19న కేయూ బంద్‌కు పిలుపునిచ్చింది. దానిని అడ్డుకునేందుకు అనుకూల విద్యార్థి సంఘాలు సిద్ధమవుతున్నాయి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు అనేది రాష్ట్ర ప్రభుత్వ వినూత్న భావన. విప్లవాత్మకమైన ఆలోచన. ప్రతీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు (వైఐఐఆర్‌ఎస్) నిర్మించే లక్ష్యంతో తాజాగా మరో 20 పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలలకు రూ.200కోట్ల చొప్పున మొత్తం రూ.4వేల కోట్లకు పరిపాలనా అనుమతులిస్తూ విద్యాశాఖ కార్యదర్శి జారీచేశారు. గతంలో 58 స్కూళ్లకు అనుమతులు లభించాయి. మొత్తం 78 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయి. తాజాగా 20 నియోజకవర్గాలకు మంజూరైన పాఠశాలల్లో వరంగల్ పశ్చిమ, మహబూబాబాద్‌లు ఉన్నాయి. ఈ పాఠశాలల ఏర్పాటుకు ఒక్కోదానికి గరిష్ఠంగా 15 ఎకరాలు అవసరమవుతుంది.

వ్యతిరేకత

యూనివర్సిటీ స్థలంలో ఈ స్కూలు ఏర్పాటుపై విద్యార్థి సంఘాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేకతలో కూడా కొంత సహేతుకత లేకపోలేదు. స్కూలుకు విలువైన భూమిని కేటాయించడంవల్ల భవిష్యత్ అవసరాలకు స్థలం లేకుండాపోతుందన్నది ఈ సంఘాల ఆందోళన. ప్రస్తుతం 15 ఎకరాలే తీసుకున్నా భవిష్యత్తులో స్కూలు విస్తరణలో భాగంగా మరింత స్థలం తీసుకోరన్న గ్యారెంటీ లేదంటున్నారు. విశ్వవిద్యాలయం భూములు కబ్జాలకు గురైన నేపథ్యంలో స్కూలుకు స్థలం కేటాయింపుపై సహజంగానే వారిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. సమీకృత విద్యాలయం ఏర్పాటుతో పేదవిద్యార్థులకు కలిగే ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని ఎస్ఎస్‌యూతోపాటు మరికొన్ని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుతం ఉన్న గురుకులాలకు అదనంగా ఏర్పాటయ్యే ఈ విద్యాలయం నగరం నడిబొడ్డున ఉండడం వల్ల పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని అట్టడుగు, అణగారిన, నిరుపేదల కుటుంబాల పిల్లల భవిష్యత్ ఉజ్వలంగా మారతాయంటున్నారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రతిపాదిత కేయూలోని సీఆర్‌పీఎఫ్ ఖాళీ స్థలం

నగరం నడిబొడ్డున..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా పాఠశాలను ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంలో కేయూ ప్రాంగణంలోనే అయితేనే అనుకూలంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమైంది. నియోజకవర్గం పూర్తిగా పట్టణ ప్రాంతం కావడంతో ప్రభుత్వ ఖాళీ స్థలాలు అంతగా అందుబాటులో లేవు. హనుమకొండ పట్టణానికే మణిహారంగా నిలువనున్న ఈ స్కూల్‌ను ఏక్కడో ఊరవతల ఏర్పాటు చేయడంకన్నా నగరం నడిబొడ్డున ఉన్న కేయూ పరిధిలో ఏర్పాటు చేయడంవల్ల పేద విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని, తల్లిదండ్రులకు కూడా స్కూలు దగ్గరగా ఉన్నట్టు ఉంటుందన్న వాదన వినిపిస్తోంది. పైగా కేయూలో ఏర్పాటు చేసేది మరో విద్యా సంస్థనే కనుక ఒక ఉన్నత విద్యాసంస్థ ఆవరణలో మరో విద్యాలయం ఏర్పాటు చేయడంలో తప్పేమీలేదని, పైగా సమగ్రత చేకూరుతుందన్న చర్చ జరుగుతోంది.

వ్యతిరేకించడం వెనుక రాజకీయ కోణం



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను కేయూ స్థలంలో ఏర్పాటును వ్యతిరేకించడం వెనుక రాజకీయ కోణం ఉంది. రూ.200కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో ఈ స్కూల్ ఏర్పాటుతో నాకు ఎక్కడ మంచి పేరు వస్తుందోన్న దుగ్ధతో బీఆర్‌ఎస్, దాని అనుబంధ విద్యార్థిసంఘం గుడ్డిగా వ్యతిరేకిస్తోంది. యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం నియోజకవర్గం అంతా తిరిగాను. నియోజకవర్గం పూర్తిగా పట్టణ ప్రాంతం కావడం వల్ల ఎక్కడా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవు. చివరికి కేయూలో ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గంగా కనిపించి అన్ని విద్యార్థి సంఘాలతో కూలంకషంగా చర్చించాను. అందరు సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత ఇందులో ఒకటీ రెండు సంఘాలే ఇప్పుడు వ్యతిరేకిస్తున్నాయి. సీఆర్‌పీఎఫ్ ఖాళీ చేసిన భూమినే అడుగుతున్నాము కానీ కేయూలోని వేరే ఇతర భూములను కాదు. కేయూ స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూలును మొదట్లో వ్యతిరేకించిన ఒకటి, రెండు సంఘాలు తమ తప్పును తెలుసుకొని మద్దతు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయి. బీఆర్‌ఎస్, దాని అనుబంధ సంఘాలకు ప్రతీది రాజకీయం చేయడం అలవాటుగా మారింది.

\- రాజేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే



ఎంవోయూ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న డైరెక్టర్ ప్రొఫెసర్ సుబుధి, డీన్లు

నిట్, నార్డ్‌హౌజెన్ వర్సిటీ మధ్య ఎంవోయూ

- అకాడమిక్, పరిశోధనల్లో కొత్త అధ్యాయం
- రెండు సంస్థల మధ్య బలోపేతం కానున్న సహకారం

హనుమకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్‌ఐటీ, నార్డ్‌హౌజెన్ యూనివర్సిటీ ఆఫ్ అప్లయిడ్ సైన్సెస్ (జర్మనీ) మధ్య మంగళవారం అవగాహనా ఒప్పందం కుదిరింది. అంతర్జాతీయ అకాడమిక్, పరిశోధనా సహకారాల్లో కొత్త అధ్యాయానికి ఈ ఒప్పందం నాందీ పలికింది. ఈ వర్చువల్ కార్యక్రమంలో వరంగల్ నిట్ తరుపున డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ పరిశోధన, కన్సల్టెన్సీ డీన్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్‌తో పాటు పలువురు ఇతర విభాగాల డీన్లు, అసోసియేట్ డీన్లు పాల్గొన్నారు. నార్డ్‌హౌజెన్ యూనివర్సిటీ పక్షాన ప్రెసిడెంట్ ప్రొఫెసర్ జోర్గ్ వాగ్నర్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ మిస్ జెన్నీ, మిస్టర్ వినోద్ పాల్గొన్నారు. ఉమ్మడి పరిశోధన, అంతర్జాతీయ సమావేశాల సంయుక్త నిర్వహణ వంటి అంశాల్లో ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తుంది. ఇప్పటికే నిట్ వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ కాకునూరి మనోహర్, నార్డ్‌హౌజేన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సెబాస్టియన్ వోస్‌వింకెల్, భారత దేశం, జర్మనీలోని పరిశ్రమలతోకలిసి ఒకసంయుక్త పరిశోధనాప్రతిపాదనను సమర్పించారు. అవగాహన ఒప్పందం ద్వారా రాబోయే రోజుల్లో మరిన్ని సంయుక్తకార్యక్రమాలు, సందర్శనలు జరుగుతాయనిఇరుపక్షాలు ప్రకటించాయి.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

- యుద్ధ ప్రతిపాదిక వ్యవసాయ సర్వీసులు మంజూరు
- హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు మధుసూదన్ రావు, గౌతంరెడ్డి

రాంగనర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిందించేందుకు అహర్నిశలు శ్రమిస్తూ అనేక చర్యలు చేపడతున్నామని హనుమకొండ, వరంగల్ ఎస్ఈలు మదుసూదన్‌రావు, గౌతంరెడ్డి వేర్వేరు ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ సర్వీసులను యుద్ధ ప్రతిపాదికన మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వరంగల్ సర్కిల్‌లో జూలై 2023 నుంచి జూలై 2024 వరకు 757 సర్వీసులు మంజూరు చేయగా 2024 జూలై నుంచి 2025 జూలై వరకు 824 సర్వీసులు మంజూరు చేశామని దీంతో 67 వ్యవసాయ సర్వీసులు మంజూరు పెరిగాయన్నారు. పొలం బాటలో ఇప్పటి వరకు 1141 లూజ్‌లైన్లు, 445 వంగిన పోల్‌లు, 2965 మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హనుమకొండ సర్కిల్‌లో గతంలో 1261 మంజూరైతే ఈ సంవత్సరం 1302 మంజూరు చేయగా, పొలం బాటలో 1216 లూజ్‌లైన్‌లు, 476 వంగిన పోల్‌లు, 3609 మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులట్రాన్స్‌ఫార్మర్ల తరలింపులో ఏలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ప్రత్యేక వాహనాలు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు విద్యుత్ సమస్యలపై 1912 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందిస్తున్న వరంగల్ ఎంపీ కడియం కావ్య

పేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ నిరుపేదల కుటుంబాలకు అండగా ఉంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కనుకదుర్గా కాలనీలోని ఎంపీ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ. 6.20 లక్షల సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం నిరుపేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు నిధులు విడుదల చేసినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్ష

ఆగస్టు 19-21 తేదీల్లో కేయూలో నిర్వహణ

కేయూ క్యాంపస్ జూలై 15, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆగస్టు 19-21 తేదీల్లో నిర్వహిస్తామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మ్యానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు లోకల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డితో కలిసి సమీక్షించారు. ఇప్పటి వర కు జరిగిన ఏర్పాట్లు, మిగిలిన పనులన్ని త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వివిధ కమిటీల బాధ్యతలు, రిసెర్చ్ పేపర్ల సమర్పణ ప్రక్రియ, అతిథులకు వసతుల ఏర్పాట్లపై దిశానిర్ధేశం చేశారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, సీహెచ్.సంజీవరెడ్డి, ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, టి. రవీందర్, ఎస్.జ్యోతి, జె.కృష్ణవేణి, ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ కాంగ్రెస్ మానిటరింగ్ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన పోస్టుకార్డులతో విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాంనగర్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి డిగ్రీ విద్యార్థులు మంగళవారం పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధి ప్రధాన ఎజెండాగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో 8,000 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, దాని కారణంగా డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్, జిల్లా నాయకులు ముషారఫ్, విజయ్, దీక్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీ జోరు.. ఎంతో హుషారు...

రహదారులపై ఎలక్ట్రిక్ వాహనాల సందడి

- తక్కువ ఖర్చు.. జీరో మెయింటనెన్స్
- కాలుష్య రహితం.. ఖర్చు మితం
- కొనుగోలుకు మొగ్గు చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

లింగాలఘణపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్లు రోడ్లపై దూసుకెళ్తున్నాయి. ఇంధన ఖర్చు లేకపోవడం, జీరో మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. పర్యావరణ హితం కావడం, విద్యుత్ వాహనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృతంగా ప్రోత్సహిస్తుండటంతో ఇప్పుడు ఈ వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఎనిమిదేళ్ల క్రితమే మార్కెట్లోకి ఆరంగేట్రం చేసిన ఎలక్ట్రిక్ వాహనాలు ఇప్పుడిప్పుడే జనసామాన్యులకు చేరువవుతున్నాయి. ఒక్కసారి కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ వాహనం మూడేళ్ల వరకు ఎలాంటి ఖర్చులు లేకుండా ఇంధన భారం నుంచి పూర్తిగా ఉపశమనం దొరుకుతుండటంతో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంతో పాటుగా ప్రధానంగా స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో హీరో, హోండా, బజాజ్, టీవీఎస్, బుల్లెట్(ఎస్‌ఫీల్డ్)లాంటి షోరూమ్‌లతో పాటుగా పలు మల్టీబ్రాండ్ షోరూమ్‌లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం జనగామ జిల్లా వ్యాప్తంగా కార్లు, ఆటోలు, బైక్‌లు, స్కూటర్లు మొత్తం కలిపి 1000కి పైగా ఉన్నట్లు సమాచారం. మొదట్లో ఎలక్ట్రిక్ వాహనాలు ఊహించినంత జోరందుకోకపోవడంతో షోరూమ్ నిర్వాహకులు పెద్దగా వాహనాలను అమ్మలేక పోయారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారాలు చేయడం, కొనుగోళ్లను ప్రోత్సహించడంతో అమ్మకాలు జోరందుకున్నాయి.



నర్మెట మండలానికి చార్జింగ్ బైస్కిల్‌పై విధులకు బయలు దేరిన విద్యుత్ శాఖ లైన్‌ఇన్స్‌పెక్టర్

ఉపాధి మార్గంలో ఎలక్ట్రిక్ జోరు..

ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి రావడంతో స్వయం ఉపాధి మార్గాలకు చెందిన అనేక మంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేసి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. చిరువ్యాపారులు, కిరాణా షాపులకు వస్తువులను డెలివరీ చేసే వర్తకులు, జోర్‌డెలివరీ లాంటి వ్యాపారులు ప్రధానంగా ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఎలక్ట్రిక్ ఆటోల్లో గూడ్స్‌ను డెలివరీ చేస్తూ ఎంతో మంది ఉపాధి పొందుతుండటం గమనార్హం. ఇంధన వ్యయం లేకపోవడం, జీరో మెయింటనెన్స్ కావడంతో గతంతో పోల్చితే మరిన్ని లాభాలు వస్తున్నట్లు చిరువ్యాపారులు పేర్కొంటున్నారు.

రహదారులపై రయ్..రయ్..

ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు మాత్రమే కాకుండా ఇప్పుడు జాతీయ రహదారులపై పరుగులు పెడుతున్న కార్లు, బస్సులు రాజసాన్ని ఒలకబోస్తున్నాయి. తక్కువ ఖర్చుతో చార్జింగ్‌తో రెండు వందల కిలోమీటర్ల దాకా ఈ-మైలేజీ వస్తున్న వాహనాల్లో బస్సులు పలు సంస్థలకు కీలకంగా ఉపకరిస్తున్నాయి. ఇన్నాళ్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సైతం చార్జింగ్ బస్సులను అనేక రూట్లలో నడిపిస్తూ లాభాలను గడిస్తుండటం గమనార్హం. సంపన్న వర్గాలకే పరిమితమైన కార్లు ఇప్పుడు ఎలక్ట్రిక్ చార్జింగ్ రూపంలో సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చి రోడ్లపై రయ్‌మంటూ పరుగులు తీస్తున్నాయి.





వరంగల్-హైద్రాబాద్ రహదారిపై పరుగులు పెడుతున్న ఎలక్ట్రిక్ బస్, (ఇన్‌సెట్‌లో) జనగామ-పాలకుర్తి రోడ్డుపై ప్యాసింజర్ ఆటో ట్రిప్‌లు వేస్తున్న ఆటో డ్రైవర్

ప్రయోజనాలెన్నో..

ఈ వాహనం కొనుగోలు చేసిన నాటి నుంచి మూడేళ్ల దాకా ఎలాంటి సర్వీసింగ్ అవసరం లేదు. అలాగే ఇంధన భారం కూడా ఉండదు. బైక్‌లైతే నాలుగు గంటలు చార్జింగ్ పెడితే చాలు గంటలకు 50 కిలోమీటర్ల స్పీడుతో గరిష్ఠంగా 150 కిలోమీటర్ల దాకా ప్రయాణించే వీలుంటుంది. ఈ బైక్‌లకు, ఎలక్ట్రిక్ ఆటోలకు చార్జింగ్ పెడితే నెలకు 60యూనిట్లు మాత్రమే విద్యుత్ ఖర్చు అవుతుంది. పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల అవసరం లేకపోవడంతో పొగ లేకుండా వాతావరణ కాలుష్యం కాకుండా పర్యావరణ హితంగా ఉంటుంది. ఒక్కసారి పెట్టుబడి పెడితే ఐదేళ్ల దాకా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలపై ప్రయాణించే వీలుంటుంది.

మూడేళ్లుగా రూ.2.27 లక్షలు ఆదా చేశాను



మూడేళ్ల క్రితం రూ. 3.60 లక్షలు ఖర్చు చేసి చార్జింగ్ ఆటోను కొనుగోలు చేశాను. ఇప్పటి వరకు 68,140 కిలోమీటర్లు నడిపాను. లీటర్ డీజిల్‌కు 30 కిలోమీటర్ల మైలేజీ లెక్కన 2,271 లీటర్ల డీజిల్ కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఆ లెక్కన నాకు రూ.2.27 లక్షలు ఆదా చేయగలిగాను. నాకు చార్జింగ్ కోసం సగటున నెలకు రూ.500 ఖర్చు మినహా ఇంకా ఎలాంటి ఖర్చులు లేవు. అదే డీజిల్ ఆటో అయితే ఒక్కరితో ప్రయాణించినా ఇద్దరితో ప్రయాణించిన సగటున 150 కిలోమీటర్ల దూరం ఆటో నడిపితే రూ. 500 ఖర్చు అవుతుంది. కానీ చార్జింగ్ ఆటోకు మాత్రం రూ. 20కి మించి ఎలాంటి ఖర్చు కానేకాదు.

\- చిదిరాల కృష్ణమూర్తి, ప్యాసింజర్ ఆటో డ్రైవర్, తొర్రూర్(జె)

దేవాదులలో కొనసాగుతున్న పంపింగ్

కన్నాయిగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నుంచి పంపింగ్ కొనసాగుతోంది. సోమవారం ఉదయం వరకు ఫేజ్-1లో ఒక మోటారు, ఫేజ్-3లో రెండు మోటార్ల ద్వారా 759 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసిన ఇంజనీరింగ్ అధికారులు సోమవారం రాత్రికి ఫేజ్-2లో ఒక మోటా రును ఆన్ చేశారు. మొత్తం మొత్తం నాలుగు మోటార్ల ద్వారా మంగళవారం ఉదయం వరకు పంపింగ్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం సమయానికి ఫేజ్-1లోని మోటారును నిలిపి వేసి ఫేజ్-2లో మరో మోటారును ఆన్ చేశారు. మొత్తం ఫేజ్-2లో రెండు మోటార్లు, ఫేజ్-3లో రెండు మోటార్లు మొత్తం నాలుగు మోటార్ల ద్వారా భీంఘన్‌పూర్ రిజర్వాయర్‌కు 1,078 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 75 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

ఇంకెన్ని రోజులు ఎదురుసూడాలె..?

- ఇంకా తెరుచుకోని కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాల
- బడి వద్దకు వచ్చి తిరిగి వెళ్తున్న ఆదివాసీ విద్యార్థులు
- ఉపాధ్యాయుల నియామకంపై పట్టించుకోని ఐటీడీఏ



పాఠశాల ఆవరణలో ఎదురు చూస్తున్న విద్యార్థులు

వెంకటాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో ఆదివాసీ విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారింది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా ఉపాధ్యాయులను నియమించకపోవడంతో మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాల ఇంకా తెరచుకోలేదు. మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధిలోని కలిపాక గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన ప్రాథమిక పాఠశాల తెరుచుకోకపోవడంతో స్థానిక విద్యార్థులకు విద్య అందని పరిస్థితి నెలకొంది. గ్రామంలో 20 మందికిపైగా విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఈఏడాది వారి విద్యాసంవత్సరం ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాల తెరుచుకోకపోవడంతో ఆదివాసీల పిల్లలకు ఎదురు చూపులు తప్పడం లేదు. బడికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధాయులను నియమిస్తున్న ప్రభుత్వం మారుమూల ప్రాంతమైన కలిపాకలో 20 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉపాధ్యాయులను నియమించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలో అన్ని పాఠశాలలు ప్రారంభమై విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటే తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రారంభానికి నోచుకోలేదని స్థానిక ఆదివాసీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యనభ్యసించాల్సిన విద్యార్థులు ఖాళీగా ఉండాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. మండలంలో అధికారులు కొత్తగా నాలుగు పాఠశాలలు ప్రారంభించారు. కానీ, ఎప్పటినుంచో కొనసాగుతున్న కలిపాక పాఠశాల తెరుచుకోకపోడంతో ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. ఆదివాసీ విద్యార్థుల పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించి కలిపాక గిరిజన ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన స్థానిక నేతలు



రామచందర్‌రావును సన్మానిస్తున్న అందజేస్తున్న ములుగు జిల్లా నేతలు

ములుగు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వ కంగా కలిశారు. శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలసీ రీసెర్చ్‌మెంబర్ భూక్యా రాజునాయక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్య జవహ ర్‌లాల్, ఎస్టీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం, నాయకులు కత్తి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను యాప్‌లోనే బుక్ చేసుకోవాలి

వాజేడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు ఇక నుంచి 'మన ఇసుక వాహనం' యాప్‌లోనే ఇసుకను బుక్ చేసుకోవాలని ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పేరుతో ఇతర అవసరాలకు ఇసుకను ఇష్టారాజ్యంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తుండటంతో జిల్లా ఉన్నతాధికారులు ఈ మేరకు పాలసీని తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు ఇసుక కోసం ఇతర వాహనాలపై ఆధార పడొద్దని సూచించారు. ఇసుక తోలకాలకు సంబంధించి కొంత మంది ట్రాక్టర్ల యజమానులు రిజిస్ట్రేషన్‌ను చేసుకున్నారని, వాళ్ల ద్వారానే ఇసుక తొలకాలు జరపాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వ్యక్తుల ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి : కేవీపీఎస్

గోవిందరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలో ఈనెల 22నుంచి 24 వరకు జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ కోరారు. మండలంలోని పస్రాలో సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం అంబాల మురళి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ సమాజంలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సామాజిక అంతరాలను, కుల వివక్షతను, అంటరానితనాన్ని, మూఢనమ్మకాలను నిర్మూలిం చడం కోసం కేవీపీఎస్ కృషి చేస్తోందన్నారు. అనేక ఉద్యమాలు నిర్వహించి ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ సాధించుకున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో దళిత, గిరిజనులకు జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపు చేయాలని, కుల వివక్ష, అంటరానితనంపై నిరంతరం పోరాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు సకాలంలో అందించాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వసతులు మెరుగుపరచాలని, దళిత, బహుజను లందరికీ 300యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, దేవేందర్, సభ్యులు కోటయ్య, జగదీశ్, నరేష్, యాదగిరి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వడ్డీ రాయితీ వర్తింపు

ములుగు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా సక్రమంగా బ్యాంకు రుణాలు చెల్లించి వడ్డీ పొందిందని కలెక్టర్ టీఎస్.దివాకర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 గాను జిల్లాలోని 4409 మహిళా స్వయం సహాయక సంఘాలు రూ.3.26 కోట్ల వడ్డీ రాయితీ పొందాయని తెలిపారు. ఏప్రిల్ 2024 నుంచి జనవరి 2025 వరకు రూ.8.97 కోట్లు 5,233 సంఘాలకు వడ్డీ రాయితీ పొందినట్టు పేర్కొ న్నారు. ఫిబ్రవరి, మార్చి 2025వరకు రూ.4.91కోట్లు 5,308 సంఘాలకు వడ్డీ రాయితీ పొందినట్టు వివరిం చారు. ఇందిరా మహిళాశక్తి సంబరాల్లో భాగంగా రూ.10.88 కోట్ల వడ్డీ రాయితీ అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'స్థానిక' పోరుకు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

ఎంపీటీసీ స్థానాల్లో మార్పులేమి జరగలేదు. వాటి సంఖ్య యథాతదంగా ఉంది. ఈ జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో కొత్తగా మండలాలు, మునిపాలిటీలు ఏర్పాటు జరగనందు వల్ల మార్పులు జరగలేదు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో జడ్పీటీసీ స్థానాలో మార్పులు ఏమి జరగలేదు. ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. నర్సంపేట మున్సిపాలిటీలో 8 గ్రామాలు మహేశ్వరం, రాజపల్లె, రాములు నాయక్ తండా, మాదన్నపేట, పస్రానాయక్ తండా, ముత్తోజిపేటతో పాటు మరో గ్రామం విలీనం అయ్యాయి. ఫలితంగా నాలుగు ఎంపీటీసీ స్థానాలు మాదన్నపేట, ముత్తోజిపేట, మహేశ్వరం, రాజుపల్లె ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి.

జనగామ జిల్లాలో..

జనగామ జిల్లాలో మొత్తం 12 జడ్పీటీసీ స్థానాలు యథాతదంగా ఉన్నాయి. ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. ఇప్పటి వరకు 140 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటి సంఖ్య 134కు తగ్గింది, కొత్తగా ఏర్పాటయిన స్టేషన్ ఘన్‌పూర్ మునిసిపాలిటీలో ఆరు ఎంపీటీసీలు విలీనం అయ్యాయి. ఘన్‌పూర్‌లోని మూడు, శివునిపల్లిలో 2, చాగల్ 1 వీటిలో ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లాలో..

మహబూబాబాద్ జిల్లాలోనూ జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. ఈ జిల్లాలో మొదట 16 జడ్పీటీసీలు ఉండగా ఇనుగుర్తి, సీరోలు మండలాలు ఏర్పాటు కావడంతో అదనంగా 2 వచ్చి చేరాయి. దీనితో వీటి సంఖ్య 18కి చేరింది. ఇంతకు ముందు ఎంపీటీసీలు 196 ఉండగా కొత్తగా ఆవిర్భవించిన కేసముద్రం మున్సిపాలిటీలో అయిదు గ్రామాలు విలీనం కావడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 193కు తగ్గింది.

ఓటర్ల సంఖ్యలో మార్పు

మార్పులు, చేర్పులకు ముందు ఉమ్మడి జిల్లాలో మొత్తం 22,45,553 మంది ఓటర్లు ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 3,72,646, వరంగల్ జిల్లాలో 3,85,163, జనగామ జిల్లాలో 4,01,115, మహబూబాబాద్ జిల్లాలో 5,51,999, ములుగు జిల్లాలో 2,31,052 , జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,03,556 మంది ఓటర్లు ఉన్నారు. కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటయి జడ్పీటీసీలు పెరిగి, ఎంపీటీసీలు తగ్గడం వల్ల ఓటర్ల సంఖ్య కూడా మారనున్నదని అధికారులు చెబుతున్నారు. ఈ ఓటర్ల వివరాలకు సంబంధించిన తుది జాబితా త్వరలోనే విడుదల కానున్నది.

మ్యాప్‌ల ఏర్పాటు

పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో సిబ్బంది ఎన్నికల సంఘం పోర్టల్‌లో మారిన స్థానాల వారీగా కొత్త మ్యాప్‌లను తయారు చేస్తున్నారు. వీటి ఆధారంగానే రూట్ మ్యాప్‌లను సిద్ధం చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి వేర్వేరుగా ఆయా స్థానాలను బట్టి ఎంత మంది ఓటర్లున్నారో కూడా మ్యాపింగ్ చేస్తున్నారు. వీటిని బట్టి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఉంటుంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బ్యాలెట్ పెట్టెలు సిద్ధం చేశారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

బీసీల రిజర్వేషన్లు పెరగనున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలుచుకున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొన్నది. కొత్త రిజర్వేషన్ విధానం వల్ల ఏ స్థానాలు ఏ సామాజిక వర్గానికి వెళతాయోననే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఇది వరకే బీసీ జనాభా గణన చేసిన ప్రభుత్వం శాసన సభలో ఆమోదించి పార్లమెంట్‌కు నివేదించింది. చట్టం అమలైతే బీసీ రిజర్వేషన్ల సంఖ్య పెరగడంతో పాటు ఇతర వర్గాల సీట్లు తగ్గే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పీఏసీఎస్‌కు 3.16 లక్షల చెక్కు



చెక్కును అందుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్ అంజయ్య

వాజేడు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వాజేడు పీఏసీఎస్‌కు రూ. 3.16లక్షల విలు వైన చెక్కును రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ చేతుల మీదుగా చైర్మన్ యగ్గడి అంజయ్యకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారు సంస్థ (ఎఫ్‌పీవో)గా జిల్లాలోని పలు పీఏసీఎస్‌లను ఎంపిక చేసింది. రైతుల వద్ద నుంచి ఎఫ్‌పీవో వాటా ధనం వసూలు చేసినట్లుయితే ఈక్విటీ గ్రాండ్‌ను అంది స్తుంది. ప్రాజెక్టు రుణాలకు రూ. 2 కోట్ల వరకు క్రెడిట్ గ్యారెంటీ సౌకర్యం, రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఆర్థిక పరంగా బలోపేతం చేయడానికి, వ్యాపార అభివృద్ధికి క్రెడిట్ యోగ్యతను పెంచడానికి ఎఫ్‌పీవోలను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. జిల్లాలోని ఎనిమిది సహకార సంస్థలను ఎఫ్‌పీవోలుగా గుర్తించి మూడు నెల లపాటు కార్యాలయల నిర్వహణ నిమిత్తం రూ 3.16లక్షల చెక్కును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అందజేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

కన్నాయిగూడెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపల్లి, పాలాయిగూడెం తదితర గొత్తికోయగూడేల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని పలు చోట్ల అతికించారు. మవోయిస్టులు అడవీ బాట వీడి జనజీవన స్రవంతిలో కలవాలని అందులో పేర్కొన్నారు. కాలం చెల్లిన సిద్ధాంతాలను మావోయిస్టు అగ్ర నాయకులు వీడాలని, ప్రజాస్వామ్య మార్గంలో నడవాలని కోరారు.

మంగపేట మండలంలో..

మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునలమ్మగుట్ట, దోమేడ, పాలాయిగూడెం, తిమ్మాపురం, రాళ్లగుంపు, కేశవపురం, చింత కుంట, కొత్తనిమ్మగూడెం, పాత నిమ్మగూడెం, పెరిక టకుంట, సంగంపల్లి తదితర గ్రామాల్లో మావో యిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో ముద్రించిన పోస్టర్లను ప్రధాన కూడళ్లల్లో అతికించారు.

చెరుపల్లిలో వైద్య శిబిరం

మంగపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మంగపేట పీహెచ్‌సీలోని చెరుపల్లి ఎస్టీకాల నీలో డాక్టర్ గోపగాని తరుణ్ ఆధ్వ ర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. 70 మందికి వైద్య పరీక్షలు చేశారు. 11 మందికి జ్వరం ఉన్నట్టు నిర్ధారించారు. వ్యాధు ల తీవ్రతకు అనుగుణంగా మందులను అం దజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్ఎం మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలాయిగూడెంలో..

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలం లోని సర్వాయి సబ్ సెంటర్ పరిధి పాలాయి గూడెం గొత్తికోయగూ డెంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ భాగవతుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. జ్వరాలతో బాదప డుతున్న వారికి మలేరియా, ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహిం చారు. అవసరం ఉన్న వారికి మందులను అందించారు. అలాగే గూడెంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుజాత, హెల్త్ అసిస్టెంటు లక్ష్మణ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నివేశన స్థలాలకు పట్టాలు ఇవ్వండి

గణపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): దళితులమైన తమ నివేశన స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని అప్పయ్యపల్లి గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో మంగళవారం నిరసన తెలిపారు. 30 ఏళ్ల క్రితం గ్రామంలోని నిరుపేదలైన దళిత కుటుంబాలకు చెందిన వారమైన తమకు ఇళ్ల స్థలాల కింద సుమారు ఐదు ఎకరాల భూమిని కేటాయించారన్నారు. గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అప్పట్లో తమకు మద్దతు తెలుపుతూ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశార గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ పంపిణీ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బుర్రి సురేష్, ఇనుగాల మొగిలి, సారమ్మ, సాంబలక్ష్మి, భద్రమ్మ, రజిత, కనుకలక్ష్మి, నరేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ వైపు ఆసక్తి చూపాలి

భూపాలపల్లిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థులు డిజిటల్ వైపు ఆసక్తిచూపాలని భూపాలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలూనాయక్ అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ యూత్ స్కిల్ డే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు జరిగాయి. బాలూనాయక్ మాట్లాడుతూ అత్యధునిక డిజిటల్ యుగంలో ఉన్నామని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ వైపు అడుగులు వేస్తేనే బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజు, అనిల్‌కుమార్, రమేష్‌నాయక్, ప్రోగ్రాం అర్గనైజర్ సురేష్ పాల్గొన్నారు.

అప్పుడు దందా.. ఇప్పుడు ధర్నానా?

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఆగ్రహం

టేకుమట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్ననాళ్లు ఇసుక దందా చేసి, ఇప్పుడు అక్రమ రవాణాను అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధర్నా చేయడం విడ్డూరమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకరమణారెడ్డి, ఆయన అనుచరులు అధికారం ఉన్నంత కాలం అడ్డూ అదుపు లేకుండా ఇసుక దందా చేసిన విషయం మండల ప్రజలకు తెలుసన్నారు. క్వారీల నిర్వాహకులతో కుమ్మక్కై అక్రమ వ్యాపారం చేసిన బీఆర్ఎస్ నాయకులు ఈ రోజు ఇసుక గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. టేకుమట్ల మండలంలో దశల వారీగా ధర్నాలు, రాస్తారోకోలు చేసి ఇసుక క్వారీలను రద్దు చేయించిన ఘనత కాంగ్రెస్‌దేన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక అందించాలని ప్రాంతాలను, దూరాన్ని బట్టి ధరలను నిర్ణయించి అందిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కత్తి సంపత్, వైనాల రవీందర్, నాంపెల్లి వీరేశం, బొల్లికొండ రాజయ్య, బండి రవీందర్, శాస్త్రాల కిరణ్, చిరంజీవి, వంగ నరేష్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

చిట్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వపల్లి శివారులో 8 చోట్ల అక్రమంగా నిల్వచేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు ఇటీ వల సీజ్ చేశారు. దానిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మం గళవారం సాయంత్రం బహిరంగ వేలంపాట నిర్వహించారు. 880 క్యూ బిక్ మీటర్ల ఇసుకను కాల్వపల్లి గ్రామానికి చెందిన సూర తిరుపతి రూ. 5.72 లక్షలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్ ఇమామ్ షేక్ తెలిపారు.

ఇసుక రవాణాలో నిబంధనలు పాటించాలి

టేకుమట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిబంధలకు లోబడి ఇసుక రవాణా చేయాలని, లేదంటే కేసులు తప్పవని ట్రాక్టర్ యాజమా నులను ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక తరలింపులో పాటించాల్సిన నియమ నిబం ధనలపై ట్రాక్టర్ యాజమానులకు మంగళవారం అవగాహన కల్పిం చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదా రులకు ఇసుక తరలించేందుకు జిల్లా అధికారులు టేకుమట్ల, మొగు ళ్లపల్లి, కాల్వపల్లి మూడు రీచ్‌లను ఎంపిక చేసిందన్నారు. ఈ వాటి నుంచి కాకుండా మరో చోటు నుంచి ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక తరలించాలన్నారు.

జిల్లా యం త్రాగం ఒక్క ట్రాక్టర్ ఇసుక ఖరీదు గోరికొత్తపల్లి మండల పరిధిలో గ్రామాలకు రూ.3,500, చిట్యాల మండలానికి రూ.1,700, రేగొండ మండలానికి రూ.3,000 భూపాలపల్లి మండలానికి రూ.3,000 శాయంపేట మండలానికి రూ.4,000, మొగుళ్లపల్లి మండలానికి రూ.1,500, టేకుమట్ల మండలానికి రూ.1,500 గణపూర్ మండలానికి రూ.3,000గా నిర్ణయించినట్టు వివరించారు. ఈ రేట్లకు మించి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక తరలించే వారు తప్పనిసరిగా ట్రాక్టర్‌కు నంబర్‌ప్లేట్, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. జిల్లా యంత్రాగం సూచించిన నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మొదటి దఫా రూ.25 వేలు, రెండో దఫా రూ.50వేలు జరిమానా విధిస్తామన్నారు. మూడో దఫా కూడా నిబంధనలు ఉల్లం ఘిస్తే కోర్టులో హాజరు పరిచి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మేమిచ్చిన నిధులతో శంకుస్థాపనలా..?

కాంగ్రెస్‌పై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫైర్



రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రేగొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ హయాంలో కొత్తగా ఏర్పాటు చేసిన కొత్తపల్లిగోరి మండలానికి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు నిధులు మంజూరు కాగా, వాటితోనే కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపనలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పరిపాలన ఎరమైన ఇబ్బందులు రావద్దనే ఉద్దేశంతో జిల్లాలోనే పెద్ద మండ లంగా ఉన్న రేగొండ మండలాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి కొత్తపల్లిగోరి మండలాన్ని ఏర్పాటు చేయించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. యాక్షన్‌ఫుల్.. డెవలప్‌మెంట్ నిల్ అనే చందాన పాలకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగార్థులకు పరీక్షలు నిర్వహిస్తే రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందచేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేరుచెప్పుకోవడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, మండల అధ్యక్షుడు హమీద్, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, కొత్తపల్లిగోరి టౌన్ అధ్యక్షుడు రఘుసాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పశువులను సంరక్షించుకోవాలి

మంగపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పలు జాగ్రత్తలు పాటించి పశువులను సంరక్షించుకోవాలని తిమ్మంపేట పశు వైద్యాధికారి సి.హెచ్.రజిత సూచించారు. తిమ్మంపేట, చెరుపల్లి, బుచ్చంపేట, నర్సాయిగూడెంలో 869 పశువులకు మంగళవారం గొంతువాపు నివారణ టీకాలు వేశారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు

వెంకటాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి జ్యోతి 71 మంది మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా నూగూరు, మరికాల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్థులను పరీక్షించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులబారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, పవన్‌కళ్యాణ్, స్నేహ, సత్యనా రాయణ, మనోహర్, సిబ్బంది యాకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ గడువు పెంపు

ములుగు కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ గడువు ఈనెల 30 వరకు పెంచినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఓపెన్ ఇంటర్ కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ భగవద్గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదవతరగతి పూర్తిచేసి అనివార్య కారణాల వల్ల రెగ్యులర్ ఇంటర్ చదవలేక పోయిన వారు, రెగ్యులర్ ఇంటర్ ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొ న్నారు. పూర్తి వివరాలకు 7396688474 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కార్యదర్శులు లేక తప్పని అవస్థలు

మల్హర్, జూలై 15(ఆంధ్రజ్యోతి) : మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా 11 మంది మాత్రమే కార్యదర్శులు ఉండటంతో గ్రామాల్లో పనులు కుంటుపడుతున్నాయి. మరికొందరు కార్యదర్శులు అదనపు బాధ్యతలతో సతమతమవు తున్నారు. మండలంలో ఇద్దరు కార్యదర్శులకు తమ జీపీ కాకుండా మరోదానికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఒక కార్యదర్శికి మాత్రం ఏకంగా రెండు జీపీల అదనపు బాధ్యలు ఇచ్చారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. తమ జీపీతో పాటు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న జీపీల్లో విధుల నిర్వహణ, పనులకు డబ్బుల పెట్టుబడి తలకు మించిన భారంగా మారిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టిన డబ్బులు రాక ఇబ్బందులు పడుతుంటే అదనపు బాధ్యతలతో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మారిందని అంటున్నారు. గ్రామ కార్యదర్శుల నియామకం లేని పంచాయతీలల్లో వివాహ, జనన, మరణ సర్టిఫికెట్ల, ట్రేడ్ లైసెన్సు జారీలో ప్రజలు కార్యదర్శుల కోసం ప్రజలు ఎదురు చూడక తప్పడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికలు రేపోమాపో అంటున్న తరుణంలో జీపీలకు కార్యదర్శుల లేక పోవడం వల్ల ఇబ్బందులు తప్పేలా లేవు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా కార్యదర్శులు లేకుంటే గ్రామాల్లో పారిశుధ్య పనులు కూడా పడకేసే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు మండలానికి పూర్తిస్థాయి కార్యదర్శులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

క్షయపై అవగాహన కలిగి ఉండాలి

ఏటూరునాగారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) వ్యాధిపై ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని కొండాయి వైద్య అధికారి డాక్టర్ హెచ్. ప్రణీత్ కుమార్ అన్నారు. మం డలం పరిధిలోని కొండాయిలో క్షయ నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ పట్ల అప్రమత్తంగా ఉండాలని, విధిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. హెల్త్ అసిస్టెంట్ కె.భాస్కర్‌రావు, టీబీ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజు, ఏఎన్ఎం సమ్మక్క పాల్గొన్నారు.

చల్పాకకు బస్ సౌకర్యం కల్పించాలి

ఏటూరునాగారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్పాక గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కర్నె లాజర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో చల్పాక మార్గంలో బస్ సేవలు అందుబా టులో ఉండేవని, కానీ ప్రస్తుతం బస్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.